
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
5
మంగళవారం 12 ఆగస్టు 2025





# ముంచెత్తిన వాన



కాకనూరు-భోజనం గ్రామాల వద్ద వంతెనపై ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న కుందూనది

- జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం
- నందికొట్కూరులో 131.4 మి.మీ. వర్షపాతం
- ఉగ్రరూపం దాల్చిన కుందూనది
- బండిఆత్మకూరులో ప్రమాదకర స్థాయిలో ప్రవాహం
- హై అలర్ట్ ప్రకటించిన అధికారులు
- స్తంభించిన రాకపోకలు
- నీట మునిగిన పంటలు
- మిడ్తూరులో మద్దిగుండం చెరువుకు గండి

**నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** కుండపోత వర్షం నంద్యాల జిల్లాను వణికించింది. ఆదివారం రాత్రి 11 గంటలకు ప్రారంభమైన వర్షం సోమవారం ఉదయం వరకు ఏకధాటిగా కురిసింది. బంగాళాఖాతంలోని రుతుపవన ద్రోణి, కోస్తాంధ్ర తీరంలో ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లాలో ప్రవహిస్తున్న కుందూనది ఉగ్రరూపం దాల్చింది. మిడ్తూరు మండలంలోని మద్దిగుండం చెరువుకు గండిపడటంతో పొలాలోకి వరద పోటెత్తింది. నంద్యాల నుంచి భీమవరం వెళ్లే దారిలో నిప్పుల వాగు బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తూ ప్రమాదకరంగా మారింది. కేసీ కెనాల్‌లో గుర్రపుడెక్క ఎక్కడికక్కడ పేరుకపోవడంతో నీటి ప్రవాహం ముందుకు సాగక తూముల వద్ద ప్రమాద సంకేతాలు కనపడుతున్నాయి. నందికొట్కూరులో ఏకంగా 131.4 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. వెలుగోడు 118.2, పాములపాడు 96.8, జూపాడుబంగ్లా 94.8, కొత్తపల్లె 94.8, బండిఆత్మకూరు 94.4, గడివేముల 68.6, మిడ్తూరు 68.4, ఆత్మకూరు 52.8, పగిడ్యాల 46.8, మహానంది 40.4, కోవెలకుంట్ల 29.8, పాణ్యం 28.2, శిరివెళ్ల 25.8, నంద్యాల పట్టణం 24.8, చాగలమర్రి 22, బనగానపల్లె 19, ఉయ్యాలవాడ 17.6, డోన్ 16, నంద్యాలరూరల్ 14.6, రుద్రవరం 13.8, బేతంచెర్ల 13.2, ఆళ్లగడ్డ 12, దొర్నిపాడు 8.6, గోస్పాడు 7.6, ప్యాపిలి 6.6, కొలిమిగుండ్ల 5.4, సంజామల 5, అవుకు 1.6 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది.



భీమవరం రోడ్డులో బ్రిడ్జిపై పొంగి ప్రవహిస్తున్న నిప్పులవాగు



నీట మునిగిన వరినాట్లు

## కుందూ ఉగ్రరూపం

**బండిఆత్మకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** బండి ఆత్మకూరు మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. ఎడతెరపి లేని కురిసిన వానకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండల వ్యాప్తంగా 94.44 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. మద్దిలేరు, సంకల, జళ్ళ కనిక, రాళ్ళ ఎల్ వాగులు రాధా, కృష్ణమ్మ వంకలు పొంగి పొర్లాయి. కుందూనది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. కుందూనది పరివాహక ప్రాంతాల్లోని పంటలన్నీ నీట మునిగాయి. వరినాట్లతో పాటు మినుము, మొక్కజొన్న పంటలు పూర్తిగా నీట మునిగాయి. భోజనం - పెద్దదేవళాపురం, కాకనూరు - పార్నపల్లె, పరమటూరు - సంతజూటూరు గ్రామాల మధ్య ఉన్న కుందూనది వంతెనలపై నీటి ప్రవాహం ఉధృతంగా రావడంతో రాకపోకలు స్తంభించాయి. అలాగే పలు గ్రామాల మధ్య ఉన్న వాగులు, వంకల ప్రవాహాలతో రాకపోకలు నిలచి పోవటం, లోతట్టు కాలనీలు ఎరుకల కాలనీ, చిన్న దేవళాపురం మైనార్టీ, మేదర, లింగాపురం ఎస్సీ కాలనీల్లోని నివాసాల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బండిఆత్మకూరు శివారులోని మోడల్ స్కూల్ వద్ద కుందూనది ప్రవాహంతో కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు పాఠశాలకు సెలవు ప్రకటించారు. ఎలాంటి ప్రమాదకర సంఘటనలు చోటు చేసుకోకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రభావిత ప్రాంతాల వద్ద సిబ్బందితో పహారా చేపట్టారు.

## మరో నాలుగు రోజుల పాటు వర్షాలు



గుర్రపు డెక్క అడ్డుపడి ప్రమాదకరంగా ప్రవహిస్తున్న కేసీ కెనాల్

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రానున్న నాలుగు రోజుల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం వెల్లడించింది. నేడు ఉమ్మడి జిల్లాల్లో 64.5 మి.మీ., నుంచి 115.5 మి.మీ., వరకు అనేకచోట్ల వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించిస్తోంది. అలాగే బుధవారం నంద్యాల జిల్లాలో 115.6 మి.మీ., నుంచి 204.4 మి.మీ., వరకు వర్షం కురిసే అవకాశం ఉంది. కర్నూలు జిల్లాలో మాత్రం సాధారణ వర్షపాతం నమోదయ్యే ఉంది. 14వతేదీ గురువారం ఉమ్మడి జిల్లాల్లో 115.5 మి.మీ., నుంచి 204.4 మి.మీ., వరకు వర్షాలు కురుస్తాయి. 15వతేదీ సాధారణ నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

## మద్దిగుండం చెరువుకు గండి



మద్దిగుండం చెరువుకు పడిన గండి

**మిడ్తూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** మిడ్తూరు మండల పరిధిలోని జలకనూరు మద్దిగుండం చెరువుకు గండి పడింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కుందువాగు ఉధృతంగా ప్రవహించడం వల్ల మద్దిగుండం చెరువుకు వరద నీరు చేరింది. దీంతో తూము దగ్గర పెద్ద రంధ్రం ఏర్పడి చెరువు నీరు వృథాగా పొలాల్లోకి పారుతోంది. ఈ చెరువు కింద 1500 ఎకరాల ఆయకట్టు రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. చెరువుకు గండి పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇరిగేషన్ శాఖ ఏఈ వేదనారాయణ అప్రమత్తమై గండిని పూడ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



ఎరుకల కాలనీలో ఇళ్లవద్దకు చేరిన వర్షపు నీరు



మొక్కజొన్నలో నిలిచిన వాన నీరు



ఈర్నపాడు వద్ద మద్దిలేరు దాటుతున్న జనం

## రోళ్లపాడును రక్షించండి

### పార్లమెంట్‌లో ప్రస్తావించిన ఎంపీ బైరెడ్డి శబరి



మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

**నందికొట్కూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** వన్యప్రాణులకు ప్రధాన ఆవాసమైన రోళ్లపాడు అభయారణ్యం రక్షణకు కేంద్రం సహకరించాలని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలోని పార్లమెంట్‌లో ఆమె రోళ్లపాడు అభయారణ్యం, నల్లమల, వన్యప్రాణుల రక్షణ గురించి జీరో అవర్‌లో ప్రస్తావించారు. నందికొట్కూరు నియోజకవర్గంలో ఉన్న రోళ్లపాడు అభయారణ్యం రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లోని అభయారణ్యాల రక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. రోళ్లపాడును ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ వైల్డ్‌లైఫ్ హ్యాబిటేట్ స్కీంలో ప్రాధాన్య ప్రాజెక్టుగా చేర్చి బ్రిడ్డింగ్ అండ్ కన్జర్వేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం రూ.243 కోట్లు విడుదల చేసినా, ఏపీకి మాత్రం ఒక్క రూపాయి కూడా రాలేదన్నారు. ఈ తప్పిదాన్ని కేంద్రం సరిచేసి అవసరమైన నిధులు అభయారణ్యాల రక్షణకు మంజూరు చేయాలని ఎంపీ బైరెడ్డి శబరి కోరారు.

## సమస్యలు పరిష్కరించాలి: కలెక్టర్




ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

**నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):** ప్రజా సమస్యల పరిష్కారవేదిక ద్వారా వచ్చే సమస్యలను నిర్దీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం చేయాలని, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అందిన ఫిర్యాదులపై కూడా ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంపై సీఎంవో కార్యాలయం నేరుగా పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో ఏ మాత్రం అశ్రద్ధ చేయకూడదన్నారు. తనకు సొంత ఇల్లు లేదని నంద్యాల మండలం నడిగడ్డకు చెందిన నబీరసూల్, తనకు భూమి లేకున్నా ఇతరుల భూమి తనపేరుపై చూపిస్తుండడం వల్ల తనకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు రావడం లేదని బండిఆత్మకూరు మండలం నారాయణాపురం గ్రామానికి చెందిన షేక్ కరీముల్లా అర్జీలు ఇచ్చారని చెప్పారు. ఇలా అనేక సమస్యలు వచ్చాయని వెంటనే వాటిని ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశామని చెప్పారు.

## ఫిర్యాదులను సత్వరమే పరిశీలించాలి: ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

**నంద్యాల టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):** జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి వాటికి న్యాయం చేయాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సూచించారు. నంద్యాలలోని బొమ్మలసత్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ 83 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే న్యాయ పరిధిలో న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. ఎక్కువగా కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, డబ్బులు మోసం చేయడం వంటి సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఒకే నెంబర్ ప్లేట్‌తో రెండు వాహనాలు

- స్వాధీనం చేసుకున్న పోలీసులు



చాగలమర్రిలో పట్టుబడ్డ వాహనాలతో ఎస్ఐ, నంద్యాల ఏఎంవీఐ

**చాగలమర్రి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి గ్రామంలో పూలమండి నిర్వహిస్తున్న ఇద్దరు కడప జిల్లా కానగూడురు గ్రామానికి చెందిన వైసీపీ వర్గానికి చెందిన పూల వ్యాపారులు వారి చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. పూలమండి నిర్వహిస్తూ వాటిని వ్యాపారం నిమిత్తం హైదరాబాద్‌కు పూల బాక్సులను తరలించేందుకు వాహనాలను ఏర్పాటు చేసుకున్నారు. అందులో భాగంగానే రెండు వాహనాలకు ఒకే నెంబర్ ప్లేట్‌ను పెట్టుకొని రాకపోకలు చేస్తున్నారు. ఈ నెల 8వ తేదీ రాత్రి టోల్‌ప్లాజా వద్ద ఎస్ఐ సురేష్, పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఏపీ 39 యూఎన్ 5808 నంబర్ వాహనం పూల బాక్సుల లోడ్‌తో చాగలమర్రి వైపు నుంచి హైదరాబాదు వైపు వెళ్తుండగా గుర్తించి తనిఖీలు నిర్వహించారు. మరి కొద్ది సేపటికే మరో వాహనం పూల బాక్సు లోడ్‌తో అదే నంబర్‌తో టోల్‌ప్లాజా సమీపానికి చేరుకుంది. పోలీసులను చూసిన డ్రైవర్ పారిపోవడానికి వాహనాన్ని అతివేగంగా చాగలమర్రి వైపు వెనక్కి మళ్లించాడు. పోలీసులు గుర్తించి ఆ వాహనాన్ని పట్టుకొని రెండు వాహనాలను పరిశీలించగా ఒకే నంబర్ ప్లేట్ గల వాహనాలు పోలీసులు గుర్తించారు. పట్టుబడిన వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. రెండు వాహనాలకు ఒకే నంబర్ ప్లేట్ ఉండటంతో ఎస్ఐ సురేష్ స్పందించి విచారణ చేపట్టారు. 9వ తేదీ పట్టుబడ్డ వాహనాల గురించి నంద్యాల ఆర్టీవో కార్యాలయ అధికారులకు నివేదికలు పంపించారు.

**వాహనాల పరిశీలన :** పట్టుబడిన వాహనాలను నంద్యాల ఏఎంవీఐ నాగేంద్రరావు, సిబ్బంది రవికుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఒకే నంబర్ ప్లేట్‌తో రెండు వాహనాలు ఉన్న వాటిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఒకే నంబర్‌గల వాహనానికి పర్మిట్, ట్యాక్సు కట్టకుండా తిప్పుతున్నారని తెలిపారు. అదే నంబర్‌తో ఉన్న మరో వాహనం ట్యాక్సు కట్టకుండా తిప్పుకుంటున్నారని తెలిపారు. ఈ వాహనాలకు సంబంధించి కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు.

## యూరియా కొరత లేదు.. ఆందోళన వద్దు

- రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- మంత్రి ఎన్ఎండీ ఫరూక్



మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

**నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** యూరియా కొరత లేదని.. రైతులు ఆందోళన చెందవద్దని, రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని న్యాయ, మైనార్టీశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ రైతులకు భరోసానిచ్చారు. నంద్యాల టెక్కె మార్కెట్‌యార్డు కార్యాలయంలో మార్కెట్‌యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశానికి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గౌరవాధ్యక్షుడిగా హాజరయ్యారు. సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రైతాంగానికి పెరుగుతున్న అవసరాల దృష్ట్యా పొలాలకు లింక్‌రోడ్లు వేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా మార్కెట్ ఆదాయ మార్గాలను పెంచుకోవాలన్నారు. టెక్కె మార్కెట్ యార్డులో రోడ్డుకు పక్కన ఉన్న షాపుల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. మార్కెట్‌ను అభివృద్ధి చేసిన వారిని మరిచి కార్యాలయం నిండా ఫొటోలను పెట్టారని ఎద్దేవా చేశారు. గోస్పాడు మండలం దీబగుంట్ల సొసైటీకి మే, జూన్‌లోనే ఎరువులు ఎలా ఇచ్చారని, దీనిపై విచారణకు ఆదేశిస్తున్నామని చెప్పారు. మార్కెట్‌యార్డుకు చెందిన షాపులు, గోదాములను బహిరంగవేలం ద్వారా నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. రైతు సమాఖ్యలు రైతుల కోసం నిర్వహించాలే కాని రాజకీయాల కోసం కాదన్నారు. చైర్మన్ హరిబాబు మాట్లాడుతూ కార్యాలయ మరమ్మతులకు రూ.10 లక్షలు, కాంపౌండ్ మరమ్మతులకు రూ.10లక్షలు, టెక్కె మార్కెట్‌యార్డులో 9 షాపులు నిర్మాణాలకు రూ.58లక్షలు తదితర పనులకు రూ.1.70 కోట్లతో చేపట్టేందుకు తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి కల్పన, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రంగప్రసాద్, డైరెక్టర్లు స్వామినాయక్, అజ్మీర్, నూర్‌బాషా, మదార్‌సా, రవికుమార్, విజయగౌరి, పరిమళ, అనసూయ, నాగలక్ష్మి, లీలావతి, నాగమ్మ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

## వెండి రథంపై మల్లన్న



వెండి రథంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

**నంద్యాల కల్చరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):** శ్రీశైలక్షేత్రంలో సోమవారం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు వైభవంగా ఊయల సేవ, వెండి రథోత్సవం నిర్వహించారు. శ్రీశైలక్షేత్రంలో లోక కల్యాణార్థం ఆలయ ప్రాంగణంలో ఆలయ వేదపండితులతో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. శ్రీశైల క్షేత్రంలో పంచమఠాలైన ఘంటామఠం, భీమశంకర మఠం, విభూతి మఠం, రుద్రాక్ష మఠం, సారంగధర మఠం లోక కల్యాణం కోసం అర్చకులు పూజాదికాలు జరిపించారు. సాయంకాలం నిత్య కళారాధనలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సికింద్రాబాద్‌కు చెందిన నాట్య స్కూల్ ఆఫ్ కూచిపూడి బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన ఏర్పాటు చేశారు. కళల పరిరక్షణలో భాగంగా నిత్యకళారాధన కార్యక్రమంలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు నిర్వహించారు.

## తుంగాతీరనివాస గోవిందా.. గోవిందా..!

- స్వర్ణ రథంపై రాఘవేంద్రుల విహారం
- బృందావనానికి మహా పంచామృతాభిషేకం
- గజవాహనంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు

6



## 43 సంఘాలకు త్రీమెన్ కమిటీలు

**కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేల సిఫారసు మేరకు ప్రభుత్వం త్రీమెన్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లాలో కోడుమూరు, లద్దగిరి, పెద్దకడుబూరు, ఎమ్మిగనూరు సంఘాలకు త్రీమెన్ కమిటీలు ఏర్పాటయ్యాయి. అదేవిధంగా నంద్యాల జిల్లాలో 39 సంఘాలకు త్రీమెన్ కమిటీలు ఏర్పాటయ్యాయి. నంద్యాల జిల్లాలో 56 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉండగా.. సోమవారం మూడో విడత 39 సంఘాలకు కమిటీలను నియమించారు. కర్నూలు జిల్లాలో 43 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉండగా.. తాజాగా నాలుగు సంఘాలకు కమిటీలను ఏర్పాటు చేశారు. ఇంకా ఆరు సంఘాలకు కర్నూలు జిల్లాలో ఎంపిక జరగాల్సి ఉంది. త్వరలోనే నామినేట్ చేసిన త్రీమెన్ కమీటీలకు సంబంధించి ప్రమాణ స్వీకారం ప్రక్రియ జరుగుతుందని కర్నూలు జిల్లా సహకార శాఖ అధికారి వెంకటకృష్ణ తెలిపారు.

# మంత్రాలయానికి వెండి ప్రభోత్సవాలు

మంత్రాలయం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి ఉడిపి హోటల్, పూజాబాండర్ అధినేతలు రంగాచార్, పరమేషాచార్ భక్తులు 40 కిలోల వెండితో తయారు చేసిన సూర్య చంద్ర ప్రభోత్సావాలను అందజేశారు. సోమవారం సూర్య ప్రభోత్సవంలో ప్రహ్లాదరాయలను ఊరేగించారు. దాతలను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అభినందించి సత్కరించారు.


వెండితో తయారు చేసిన చంద్ర ప్రభోత్సవం

# కిక్కిరిసిన ఉరుకుంద క్షేత్రం

కౌతాళం-ఉరుకుంద రహదారిపై ట్రాఫిక్ జామ్


భక్తుల సందడి

కౌతాళం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం సోమవారం వేలాదిమంది భక్తులతో కిక్కిరిసింది. శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా మూడో సోమవారం ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. దీంతో స్వామివారి దర్శనానికి 3 గంటలకు పైగా సమయం పట్టింది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌ను వెండి అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయం సమీపంలో ప్రవహిస్తున్న ఎల్లెల్సీలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా ఉరుకుంద-కౌతాళం రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీంతో నాలుగు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.


ట్రాఫిక్‌లో నిలిచిపోయిన వాహనాలు

# తుంగాతీరనివాస గోవిందా.. గోవిందా..!


అశేష భక్తజనవాహిని మధ్య బంగారు రథంపై ఊరేగుతున్న రాఘవేంద్రులు

- స్వర్ణ రథంపై రాఘవేంద్రుల విహారం
- బృందావనానికి మహా పంచామృతాభిషేకం
- గజవాహనంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గుండెల నిండా భక్తి నింపుకొని.. దేశం నలుమూలల నుంచి వేలాది మంది భక్తజనసందోహంతో తుంగాతీర నివాసుడైన రాఘవేంద్రుడి సన్నిధిలో భక్తులు పరవశించిపోయారు. రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాల్లో ముఖ్యమైన నాలుగో రోజు రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన మధ్యారాధనలో భాగంగా సోమవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి పీఠాధిపతి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రస్వామి బంగారు కవచాన్ని స్వర్ణ రథంపై ఉంచి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మహా మంగళహారతులు ఇచ్చారు. వేలాదిమంది భక్తుల నడుమ స్వామివారి రథం కొనసాగింది. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గజరూప అలంకరుడైన ఉత్సవమూర్తిని నూతనంగా నిర్మించిన పుష్కరిణిలో తెప్పోత్సవంపై అధిష్టించి మూడుసార్లు శిలామండపం చుట్టూ విహరించారు. అనంతరం వజ్రాలంకరణలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు ఊంజల సేవ నిర్వహించి చెక్క, వెండి, బంగారు, నవరత్నాల రథాలపై ఊరేగించారు. ఈ వేడుకలో విద్వాన్ రాజా ఎస్.గిరిరాజాచార్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఆనంద తీర్థాచార్, ఏఏవో మాధవశెట్టి, ప్రత్యేక అధికారులు కృష్ణ కౌశిక్, శ్రీషా జోయేష్, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, శ్రీపతిఆచార్, సూపరింటెండెంట్ అనంతపురాణిక్, రవి కులకర్ణి, సుజీంద్రచార్, విజయేంద్రాచార్, జయతీర్థాచార్, ఏఈ బద్రినాథ్, ద్వారపాలక అనంత స్వామి, ప్రకాష్ ఆచార్, వ్యాసరాజాచార్, డీఎం ఆనందరావు, డీఎస్పీ ఎంఎన్ భార్గవి, మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ తదితరులు పాల్గొన్నారు.

### అలరించిన నృత్య రూపకం

సోమవారం రాత్రి యోగీంద్ర కళామండపంలో బెంగళూరుకు చెందిన ప్రభాత్ కళావెదరు నృత్య రూపకం, బెంగళూరుకు చెందిన ఆర్కే శంకర్ బృందం వీణావాయిద్యం, బెంగళూరు చెందిన విద్వాన్ రాయచూరు శేషగిరిదాసుచే దాసవాని సాహిత్యం భక్తులను అలరించింది.


బంగారు రథానికి హారతులు ఇస్తున్న పీఠాధిపతి


శ్రీమఠం ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు


పీఠాధిపతి ఇచ్చే మంత్రాక్షితల కోసం చేతులు చాపిన భక్తులు

### నేడు రాఘవేంద్రుని మహారథోత్సవం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు ఉత్తరాధనలో భాగంగా మంగళవారం మహారథోత్సవం వైభవంగా జరగనుంది. దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు ఈ వేడుకకు తరలిరానున్నారు. ఉదయం రాఘవేంద్రస్వామి బృందావనానికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను గురుసార్వభౌమ సంస్కృత పాఠశాల వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ హారతులు ఇచ్చి శ్రీమఠానికి చేరుకుంటారు. అనంతరం ఉత్సవమూర్తికి మహా మంగళహారతులు ఇచ్చి వసంతోత్సవంలో భాగంగా రంగులు చల్లుకుంటారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు భక్తులనుద్దేశించి దివ్యసందేశాన్ని ఇస్తారు.


గజ వాహనంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు


పుష్కరిణిలో తెప్పోత్సవం


బృందావనానికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

# గర్జించిన వంక

- వర్షాలతో గర్జివంకపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు
- ప్రవాహం మరింతే పెరిగితే రాకపోకలు ఉండవు
- ఎత్తైన వంతెన లేకపోవడంతో ప్రజల అవస్థలు
- ఏళ్లుగా ముంపునకు గురవుతున్న 104బసాపురం గ్రామం




104 బసాపురం గ్రామం

వర్షాకాలం వస్తే చాలు.. ఆ గ్రామస్థులు వణికిపోతున్నారు. ఏటా వానలు వచ్చినప్పుడల్లా ఆ గ్రామ సమీపంలోని గర్జివంక.. గర్జిస్తోంది. బ్రిడ్జిపై నీటి ప్రవాహ ఉధృతికి రాకపోకలన్నీ నిలిచిపోతున్నాయి. జనజీవనం స్తంభించిపోతోంది. ఆదోని డివిజన్ కేంద్రానికి 6 కిలోమీటర్ల దూరం ఉంది ఆ గ్రామం. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్థులు వాపోతున్నారు. చాలా సంవత్సరాల నుంచి కష్టాలకు గురవుతున్న 104 బసాపురం గ్రామంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం

ఆదోని/ఆదోని రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వర్షం వస్తే 104 బసాపురం గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాల్సిందే. ఎందుకంటే గ్రామంలో బ్రిడ్జి ఉన్నప్పటికీ బ్రిడ్జిపైకెక్కి పారుతోంది. దీంతో గ్రామంలోకి నీరు రావడం, మరోవైపు పట్టణానికి వెళ్లాలంటే ఆ వరదనీటిలో నుంచి భయభయంగా వెళ్లాల్సిన దుస్థితి ఆ గ్రామస్థులది. ఈ గ్రామానికి ఇటీవల రహదారి నిర్మాణానికి రూ.1.50 కోట్లు నిధులు కూడా మంజూరయ్యాయి. రహదారికి నిధులు మంజూరైనా ఆ గ్రామస్థుల్లో ఆనందం లేదు. ఎందుకంటే గ్రామానికి అనుకుని ఉన్న బ్రిడ్జి స్థానంలో ఎత్తయిన వంతెన చేపట్టాకే రహదారిని నిర్మించాలంటూ గ్రామ ఐక్యతతో కలిసి అధికారులను సైతం నిలదీశారు. ముఖ్యంగా గర్జివంక భారీగా ప్రవహిస్తే గ్రామం మునిగిపోతుందని గ్రామస్థులు భయపడుతున్నారు. ఈ క్రమంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గర్జివంతెనపై నడుము లోతుల్లో వరద నీరు పారుతుండడంతో ప్రజలు, విద్యార్థులు అందులో నుంచే ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన ఎత్తు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.


బ్రిడ్జిపై పారుతున్న నీళ్లలో నిలబడి నిరసన తెలుపుతున్న 104బసాపురం గ్రామస్థులు

### స్థానిక సంస్థలను బహిష్కరిస్తాం



ఐదేళ్ల వైసీపీ పాలనలో మా గ్రామాన్ని అసలు పట్టించుకోలేదు. ఈప్రభుత్వంలోనైనా తమ గ్రామం రూపురేఖలు మారతాయని, బ్రిడ్జి నిర్మాణంతో పాటు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఎస్సీ కుటుంబాలకు ఉన్న చోటే ఇంటి పట్టాలు ఇస్తారని ఆశిస్తూ ఎదురుచూస్తేనే ఉన్నాం. ఏడాది గడిచినా కూటమి ప్రభుత్వం సైతం తమను పట్టించుకోవడం లేదు. ఇలా అయితే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తాం. మా గ్రామానికి అధికారులను, ప్రజాప్రతినిధులను రానివ్వం. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలి.

● లింగప్ప, బసాపురం గ్రామం, ఆదోని మండలం

### వర్షం వస్తే భయమేస్తోంది



వర్షం వచ్చిందంటే భయమేస్తోంది. గర్జివంక ఎప్పుడు గర్జిస్తుందో... గ్రామంలోకి ఎప్పుడు నీళ్లు వస్తాయేమోనన్న భయంతో గడపాల్సిన పరిస్థితి ఉంది. ఆదోనికి కూతవేట దూరంలో ఉన్న గ్రామాన్నే పట్టించుకోని ప్రజాప్రతినిధులు మిగతా గ్రామాలను ఎలా చూస్తారోనన్న అనుమానం కలుగుతుంది. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది.

●రంగ, బసాపురం గ్రామం, ఆదోని మండలం

### జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్


పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకుని వారికి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా సూచించారు. కర్నూలు కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నైపుణ్యం అభివృద్ధి, శిక్షణ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న జాబ్‌మేళా పోస్టర్లను సోమవారం కలెక్టర్, జేసీ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నైపుణ్య అభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 14న వివిధ రకాలైన 11 ప్రైవేటు కంపెనీల్లో 500 ఖాళీలను భర్తీ చేసేందుకు కర్నూలు బి.క్యాంపులోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు ఉండి పది నుంచి డిగ్రీ, డిప్లొమా, బీటెక్, పీజీ చదివిన వారు జాబ్‌మేళాలో పాల్గొని ఉపాధి పొందే అవకాశం ఉంటుందన్నారు. ముందుగా Naipunyam.ap.gov.in/ యూజర్ రిజిస్ట్రేషన్ లింకులో సదురు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7780478910, 9059290821 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ బి.నవ్య డీఆర్వో వెంటకనారాయణమ్మ, జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, నైపుణ్యాభివృద్ధి శిక్షణ అధికారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

### భక్తిపారవశ్యం..

● మంత్రాలయానికి 200 కిలోమీటర్ల నుంచి పాదయాత్ర


సింధనూరు నుంచి మంత్రాలయానికి వస్తున్న భక్తులు

మంత్రాలయం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటకలోని సింధనూరు పట్టణంలోని దాదాపు 350 మంది మహిళలు, యువకులు, చిన్న పిల్లలు పాదయాత్రతో సోమవారం సాయంత్రం మంత్రాలయం చేరుకున్నారు. శనివారం ఉదయం ప్రారంభించిన పాదయాత్ర సోమవారం మధ్యాహ్నానికి మంత్రాలయానికి చేరుకుంది. పాదయాత్ర సమయంలో వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు లెక్కచేయలేదు. ఇష్టదైవం రాఘవేంద్రస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 30 ఏళ్ల నుంచి రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఇలా పాదయాత్రగా వస్తున్నట్లు భక్తులు తెలిపారు.

# దంచికొట్టిన వాన

- 25 మండలాల్లో వర్షం
- అత్యధికంగా కర్నూలు రూరల్‌లో 77.2 ఎంఎం వర్షపాతం
- సి.బెళగల్‌లో అత్యల్పం 7.6 ఎంఎం


పొంగి పొర్లుతున్న వక్కెర వాగు

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వాన దంచి కొట్టింది. అత్యధికంగా కర్నూలు రూరల్‌లో 77.2 ఎంఎం అత్యల్పంగా సి.బెళగల్ మండలంలో 7.6 ఎంఎం వర్షం నమోదైంది. ఆగస్టు 13 నాటికి జిల్లాలో 41.1 ఎంఎం వర్షం నమోదు కావాల్సి ఉండగా.. ఇప్పటికే 114.9 ఎంఎం వర్షం నమోదైంది. కర్నూలు రూరల్‌లో 77.2 ఎంఎం, ఓర్వకల్లులో 68.2, ఆస్పరిలో 67.3, ఆదోనిలో 58.6, కర్నూలు అర్బన్‌లో 54.4, వెల్దుర్తిలో 42.4 ఎంఎం వర్షపాతం నమోదయింది. పెద్దకడబూరులో 38.6, కోడుమూరులో 34.6, కల్లూరులో 34.2, కౌతాళంలో 30.8, ఎమ్మిగనూరులో 30.2, క్రిష్ణగిరిలో 21.6, పత్తికొండలో 24.6, దేవనకొండలో 21.2, గూడూరులో 20.4, గోనెగండ్లలో 22.6, నందవరంలో 20.8, కోసిగిలో 14.2, మద్దికెరలో 17.2, ఆలూరులో 14.4 తదితర మండలాల్లో 7 నుంచి 13 ఎంఎం వర్షం నమోదైంది. ఊహించని రీతిలో వర్షం పడటంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలకు తెగుళ్లు, క్రిమికీటకాలు కొంత వరకు తగ్గుతాయని, ఇప్పటి నుంచి మరో వారం రోజులు ఎండలు బాగా కాస్తే పైర్లు బాగుంటాయని వారు అభిప్రాయపడుతున్నారు.


వెంగలాయదొడ్డి చెరువు నిండి తూము ఎక్కి పారుతున్న వర్షపునీరు

### పంటలకు జీవం

ఆస్పరి: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ఆస్పరిలో సుమారు 67.2 ఎంఎం వర్షపాతం నమోదయింది. ఏకధాటిగా రాత్రంతా కురవడంతో వర్షపునీరు పంట పొలాలను ముంచెత్తింది. ఖరీఫ్ సీజన్‌లో వేసిన పత్తి, ఉల్లి, వంకాయ, టమోటా, చౌళకాయ పంటలన్నీ జీవం పోసుకున్నాయి.

### పొంగి పొర్లిన వాగులు, వంకలు

కల్లూరు: కల్లూరు మండలంలో సోమవారం తెల్లవారుజామున 4 సెంటీమీటర్ల వర్షం పడింది. ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. దీంతో హంద్రీ నది, వక్కెర వాగులను వరద ప్రవాహం కొనసాగింది. ఖరీఫ్ సీజన్‌లో కురిన వర్షం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పత్తి, మొక్కజొన్న, కంది, ఉల్లి, మిరప, మినుము పంటలకు వర్షం చాలా ఉపయోగకరమని అధికారులు తెలుపుతున్నారు.

## శ్రీమఠం గోశాల గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

- దాదాపు 1500 ట్రాక్టర్ల పశుగ్రాసం దగ్ధం
- దెబ్బతిన్న గోడౌన్ ● సుమారు రూ.60 లక్షల ఆస్తి నష్టం



శ్రీమఠం గోశాల గోడౌన్‌లో కాలిపోతున్న పశుగ్రాసం

**మంత్రాలయం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాల గోడౌన్‌లో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పురవ్వలు పశుగ్రాసంపై పడటంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అక్కడే ఉన్న సూపర్‌వైజర్ రాఘవేంద్ర దేశాయ్ గోశాల సిబ్బందితో పశువులను మంటలకు దూరంగా తరలించి కాపాడారు. శ్రీమఠం అధికారులకు సమాచారం ఇచ్చిన వెంటనే ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, ఏఈ బద్రీనాథ్ ఘటనా స్థలానికి చేరుకుని రెండు ఫైరింజన్లు, ఆరు ట్రాక్టర్ల ట్యాంకర్లు, నాలుగు ఎక్స్‌కవేటర్ల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. దాదాపు 6 గంటల పాటు మంటలు అదుపు కాలేదు. దీంతో అప్పటికే అందులో ఉన్న దాదాపు 15వేల గ్రాసం చుట్టలు, కర్ణాటక భక్తులు విరాళంగా ఇచ్చిన 15 వేల గ్రాసం చుట్టలు కాలిపోయాయి. విశాలమైన గోడౌన్ సైతం మంటలకు పూర్తిగా దెబ్బతింది. అధికారులు అప్రమత్తం కావడంతో భారీ నష్టం జరగకుండా చర్యలు చేపట్టడంతో రూ.60 లక్షల నష్టం వాటినట్లు శ్రీమఠం అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. దాదాపు 2వేల గోవులకు ఏడు నెలలకు సరిపోయే గ్రాసం దగ్ధం అయింది.

## చెరువు తూములో పడి వ్యక్తి మృతి

**పెద్దకడబూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):** ప్రమాదవశాత్తు చెరువు తూములో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో జరిగింది. సోమవారం ఏఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాలివీ.. మాధవరం గ్రామానికి చెందిన తెలుగు రఘు( 32) గత 6నెలల నుంచి భార్య గ్రామమైన చిన్నతుంబళం గ్రామంలోనే నివాసం ఉంటూ కార్పెంటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 9న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు రఘు కోసం గాలింపు చేపట్టారు. అయితే సోమవారం చిన్నతుంబళం సమీపంలో ఉన్న చెరువు తూములో నుంచి ఓ మృతదేహం కాలువలో కొట్టుకురావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని బయటకు తీసి విచారించారు. అదే గ్రామానికి చెందిన రఘు మృతదేహంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రఘు భార్య లింగమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ ఆనంద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. రఘుకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

## ఆపరేషన్ సింధూర్ విజేత మోదీ: ఎంపీ శబరి

**నంద్యాల రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):** శత్రు దేశాలకు భారత సైనిక శక్తి, సామర్థ్యాలు తెలియజేసి, ఆపరేషన్ సింధూర్ విజేతగా ప్రధాని మోదీ నిలిచారని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. ఆపరేషన్ సింధూరు విజయవంతమైన సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం ఆమె కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ఢిల్లీలోని ప్రధాన మంత్రి కార్యాలయంలో మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.



మోదీని సత్కరిస్తున్న ఎంపీ శబరి

## రాఘవేంద్రుని సన్నిధిలో కన్నడ సినీ నటులు



మంత్రాలయంలో కన్నడ సినీ నటుడు జగ్గేష్

**మంత్రాలయం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కన్నడ ప్రముఖ సినీ నటులు జగ్గేష్, చైన్ శెట్టి, అలాగే టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సీతారామిరెడ్డి సోమవారం వేరు వేరు సమయాల్లో దర్శించుకున్నారు. రాఘవేంద్రస్వామి బృందావనం సజీవంగా బృందావనమైన దినాన్ని పురస్కరించుకుని బృందావనానికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు, మెమెంటో అందజేసి పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి, వరదేంద్రాచార్, వ్యాసరాజాచార్, జయతీర్థాచార్, రవి కులకర్ణి, ద్వారపాలక అనంత స్వామి పాల్గొన్నారు.

## తల్లి హత్య కేసులో కొడుకు అరెస్టు

**కర్నూలు క్రైం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):** కర్నూలు నగరంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి బుధవారపేటలో ఈ నెల 8వ తేదీ జరిగిన రుద్రాక్ష ఎల్లమ్మ హత్య కేసులో ఆమె కొడుకు జమ్మన్నను పోలీసులు అరెస్టు చేశారు. జమ్మన్న మద్యానికి బానిసై తాగడానికి తల్లి డబ్బులు ఇవ్వడం లేదని ఆమె చెవికి ఉన్న కమ్మలు లాకునేందుకు ఎల్లమ్మను నోరు, ముక్కు మూసి ఊపిరాడకుండా చేశాడు. దీంతో ఎల్లమ్మ మృతి చెందింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు జమ్మన్నను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

## బావిలో పడి భక్తుడి మృతి

**కౌతాళం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):** ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు ప్రమాదవశత్తు కాలుజారి బావిలో పడి మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని ఉరుకుంద మజరా గ్రామం తిమ్మాపురంలో జరిగింది. వివరాలివీ.. మహబూబ్ నగర్ జిల్లా హనుమాన్‌పుర గ్రామానికి చెందిన పెడింటి అనిల్ కుమార్(40) తమ బంధువు వీరమ్మ కుటుంబంతో కలిసి స్వామి దర్శనానికి ఆదివారం వచ్చారు. వీరతిమ్మాపురం గ్రామ చావిడి వద్ద ఉన్న బావిలో సోమవారం ఉదయం స్నానం చేశాడు. అందరూ కలిసి స్నానం చేసి స్వామి దర్శనానికి వెళ్లడానికి సిద్ధమవుతుండగా అనిల్ కుమార్ దుస్తులు ఉతికేందుకు బావిలో దిగగా కాలుజారి పడిపోయారు. వెంటనే అక్కడే ఉన్న గ్రామస్థులు బావిలో వెతికి అనిల్ కుమార్‌ను బయటకు తీశారు. అప్పటికే అనిల్ కుమార్ మృతి చెందారు. వీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కౌతాళం ఏఎస్ఐ రమణారెడ్డి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

**వెల్దుర్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):** ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని బైకు ఢీ కొన్న ఘటనలో అక్క, తమ్ముడికి, మరొకరికి గాయాలు కాగా.. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలివీ.. మండలంలోని బోయినపల్లి గ్రామానికి చెందిన వడ్డె కల్యాణి, వడ్డె అజయ్ అక్క, తమ్ముడు. అక్క కల్యాణి గర్భిణి కావడంతో ఉలిందకొండ పీహెచ్‌సీకి వెళ్లారు. ఆరోగ్య పరీక్షల అనంతరం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. అయితే వెల్దుర్తి సమీపంలో జాతీయరహదారి-44 గాయత్రీదేవి దేవాలయం వద్ద వెనుక వస్తున్న గద్వాల జిల్లా నంది గ్రామానికి చెందిన జగదీశ్ బైకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కల్యాణి, తమ్ముడి అజయ్‌కు స్వల్ప గాయాలు కాగా.. జగదీశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. నేషనల్ హైవే పెట్రోలింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని జగదీశ్‌ను కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు.

### ఎన్‌క్లోజర్‌లో దుప్పిలపై

# రేస్ కుక్కల దాడి

- ఆరు దుప్పిలు హతం
- మరో 17 దుప్పిల మాయం?
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



దుప్పిలు (ఫైల్)

**ఆత్మకూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):** నల్లమలలో మరో విషాదం చోటుచేసుకుంది. పులుల ఆహారం కోసం తీసుకొచ్చిన దుప్పిలను రేస్ కుక్కలు మట్టుపెట్టాయి. ఇందులో అటవీ అధికారుల నిర్లక్ష్యం ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల కాలంలో నల్లమలలో పులి ఆహారమైన గడ్డితినే జంతువుల (హెర్బీవోర్స్) సంఖ్య తగ్గుముఖం పట్టడంతో వాటి సంఖ్యను సమతుల్యం చేసేందుకు అటవీశాఖ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఈక్రమంలోనే ఇతర ప్రాంతాల నుంచి హెర్బీవోర్స్‌ను నల్లమలకు రప్పించి పులి ఆహారానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఇటీవల శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం పరిసర ప్రాంతాల్లో సంరక్షణలో ఉన్న 23 దుప్పిలను నల్లమలకు తీసుకొచ్చారు. వాటిని ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని బైర్లూటి రేంజ్‌లో గల సుద్దకుంట పరిసర ప్రాంతాల్లో వన్యప్రాణుల ఆవాసంలోని ఎన్‌క్లోజర్‌లో ఉంచారు. కానీ ఎన్‌క్లోజర్‌లో ఊహించని విషాదం చోటు చేసుకోవడంతో అటవీ అధికారులు సైతం కలవరపాటుకు గురయ్యారు. అయితే ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులు అత్యంత గోప్యంగా ఉంచారు.

### రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో ఎన్‌క్లోజర్

బైర్లూటి రేంజ్ పరిధిలో తొలిసారిగా రెండున్నర ఎకరాల్లో రూ.12లక్షల వ్యయంతో దుప్పిల కోసం ప్రత్యేకమైన ఎన్‌క్లోజర్‌ను ఏర్పాటు చేశారు. ఆరు అడుగుల ఎత్తులో ఇనుప ఫెన్సింగ్‌తో పాటు అవి బయటకు కనిపించకుండా గ్రీన్ మెష్‌తో కప్పి ఉంచారు. లోపలకు వచ్చేందుకు.. బయటకు వెళ్లేందుకు ద్వారాలను ఏర్పాటు చేశారు. అదేక్రమంలో ఎన్‌క్లోజర్‌లో అడవి తలపించే ప్రాంతంతో పాటు సహజ సిద్ధమైన నీటి వనరులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ ఎన్‌క్లోజర్‌లో సుమారు మూడు వారాల పాటు దుప్పిలను బంధించి అవి అడవిలో సహజసిద్ధంగా జీవనం సాగించే విధంగా మార్పు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తారు. ఎన్‌క్లోజర్‌లో ఉన్న దుప్పిలు అడవిలో జీవించగలుతాయన్న నమ్మకం కలిగినప్పుడు వాటిని అడవుల్లో వదిలేస్తారు.

### ఆరోజు రాత్రి ఏం జరిగిందంటే..

ఈ నెల 8వ తేది రాత్రి ఎన్‌క్లోజర్‌లో దుప్పిలు ఉన్నట్లు గుర్తించిన రేస్ కుక్కలు ఇనుప ఫెన్సింగ్ ఎక్కి మరీ అందులోకి ప్రవేశించి దాడి చేశాయి. వాటి అరుపులను గమనించిన అక్కడున్న సిబ్బంది అప్పటికప్పుడు ఎన్‌క్లోజర్ ద్వారాలను తెరచడంతో మరికొన్ని దుప్పిలు అక్కడి నుంచి తప్పించుకున్నాయి. కాగా ఆ సమయంలో ఓ చిరుత పులి ఓ దుప్పిని ఎత్తుకెళ్లినట్లు అటవీ అధికారులు భావిస్తున్నారు. మొత్తానికి ఆరు దుప్పిలు హతమైనట్లు అటవీ అధికారులు గుర్తించి వాటి కళేబరాలకు వెటర్నరీ డాక్టర్లచే పోస్టుమార్టం చేసి వాటిని ఎన్‌క్లోజర్ సమీపంలో దహనం చేశారు. అయితే రేస్ కుక్కలు ఉన్న ప్రదేశంలో దుప్పిలకు రక్షణ లేకుండా ఎన్‌క్లోజర్‌ను ఏర్పాటు చేయడం, అది కూడా తక్కువ ఎత్తులో ఇనుప ఫెన్సింగ్ ఉంచడంపై విమర్శలు ఉన్నాయి.



దుప్పిని హతమార్చుతున్న రేసుకుక్క (ఫైల్)

### ఇలాంటి ఘటన ఎప్పుడు జరగలేదు



నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలో ఇప్పటికే పలు డివిజన్లలో ఎన్‌క్లోజర్‌లను ఏర్పాటు చేయడం జరిగింది. అయితే ఇలాంటి ఘటన ఎన్నడూ జరగలేదు. ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాము. అదేక్రమంలో ఎన్‌క్లోజర్ ఇనుప ఫెన్సింగ్ ఎత్తును పెంచడంతో పాటు అందులోకి ఇతర వన్యప్రాణులు ప్రవేశించకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశాము. బైర్లూటి రేంజ్ పరిధిలో నల్లకాల్వ సమీపంలో మరో ఎన్‌క్లోజర్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నాము. దీనిని 8 అడుగుల ఎత్తు వరకు ఇనుప ఫెన్సింగ్‌తో తయారు చేస్తున్నాము.

- అబ్దుల్ రవూఫ్, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు

### మట్కా వ్యసనం..

## ఆలయంలో చోరీ..!

- 4 కిలోల వెండి, 10 గ్రాముల బంగారు అపహరణ
- ఆలయ పూజారే నిందితుడు



దేవాలయంలో చోరీకి గురైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

**ఆదోని, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** జూదం కుటుంబాలను చిన్నాభిన్నం చేయడమే కాదు.. దొంగతనాల చేయించి జైలుపాలు చేస్తుంది. మట్కా బారిన పడిన ఓ పూజారి అప్పులు అధికమై ఏమి చేయాలో తెలియక ఏకంగా దేవుడి ఆభరణాలనే కాజేశాడు. రూ.5లక్షల విలువ చేసే వెండి, బంగారు ఆభరణాలను చోరీ చేసి, పోలీసులకు చిక్కి కటకటాలపాలైన సంఘటన ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం డీఎస్పీ హేమలత విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో వెలిసిన వసిగేరప్పస్వామి దేవాలయంలో స్వామి కోసం చేయించిన 4.386 కిలోల వెండి ఆభరణలతో పాటు 10 గ్రాములు బంగారు నగలను అదే దేవాలయంలో పూజారిగా పనిచేస్తున్న గొర్రెల వసిగేరప్ప దొంగలించాడు. నెలరోజుల క్రితం అపేడున్న ఇస్వీ ఎస్ఐకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టి అనుమానితుడు గొర్రెల వసిగేరప్పను అదుపులోకి తీసుకుని విచారించారు. ఆలయంలో దేవుడు సొమ్మును తానే దొంగలించినట్లు వసిగేరప్ప ఒప్పుకున్నాడు. మట్కా ఆడడం తనకు అలవాటుగా మారి పెద్ద ఎత్తున అప్పులు చేశానని పోలీసుల ఎదుట విలపించాడు. దొంగలించిన నగలను విక్రయించి అప్పులను తీర్చాలని అనుకున్నట్లు తెలిపాడు. అయితే ఇంట్లో ఉంచిన వెండి, బంగారు ఆభరణాలను విక్రయించేందుకు కర్ణాటక రాష్ట్రం బళ్లారి పట్టణానికి తరలిస్తుండగా ఇస్వీ పోలీసులు చాగి గ్రామం సమీపంలో వసిగేరప్పను అదుపులోకి తీసుకుని విచారించామని డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ నల్లప్ప, ఇస్వీ ఎస్ఐ నాయక్, తాలూకా ఎస్ఐ రామాంజనేయులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టు హేయం

- ఏఐసీసీ సభ్యుడు లక్ష్మీనరసింహ యాదవ్

**కల్లూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):** ఢిల్లీ ఎన్నికల కమిషన్‌ను డిజిటల్ ఓటర్ లిస్ట్ ఇవ్వాలని, ఓటర్ జాబితాలో తప్పుల తడకగా ఉందని ధర్నా చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి నాయకులను అరెస్ట్ చేయడం హేయమని ఏఐసీసీ సభ్యుడు, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. దామోదరం సంజీవయ్య కాంగ్రెస్ భవన్‌లో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ బయట పెట్టిన నిజాలకు సమాధానం చెప్పలేక అరెస్టులు చేస్తారా? అని ప్రశ్నించారు. ఎన్నికల ప్రక్రియను కలుషితం చేశారని, బీజేపీ అధికారం కోసం ఈసీ వ్యవహరిస్తున్న తీరుపై అనుమానం కలుగుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి ఓటుహక్కు పునాదిలాంటిదని, అయితే ఓటును ఎన్నికల కమిషన్ విలువ లేకుండా చేసిందని అన్నారు. విచ్చలవిడిగా నకిలీఓట్లు, డబుల్ ఓట్లుతో బీజేపీ గెలుపుకు ఈసీ సహకరిస్తోందని విమర్శించారు. అదేక్రమంలో ప్రతిపక్ష నాయకుడు అడిగిన డిజిటల్ ఓటర్ జాబితా ఎందుకు ఇవ్వడం లేదని, సీసీటీవీ ఆధారాలు ఎందుకు నాశనం చేశారని, నకిలీ ఓటర్ల జాబితా ఎందుకు తారుమారు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేతలను ఎందుకు బెదిరిస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పఠాన్ అభిఖాన్, విశ్వేశ్వరరెడ్డి, రజాక్‌వలి, వెంకటనాయుడు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# విచారించి న్యాయం చేస్తాం: ఎస్పీ

**కర్నూలు క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. నగరంలోని కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 81 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, సీఐలు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

### ఫిర్యాదుల్లో కొన్ని..

కర్నూలు అశోక్‌నగర్‌కు చెందిన వినయ్ కుమార్ నా భార్యకు కడప రిమ్స్‌లో స్టాఫ్ నర్సు ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.1.50 లక్షలు తీసుకుని మోసం చేశారని నంద్యాల పట్టణానికి చెందిన ప్రదీప్ ఫిర్యాదు చేశారు.ఆధార్ సెంటరు ఇప్పిస్తామని చెప్పి కర్నూలు బుధవారపేట చెందిన బోయ రాజశేఖర్ రూ.60వేలు తీసుకుని మోసం చేశారని మంత్రాలయానికి చెందిన వీరేష్ ఫిర్యాదు చేశారు. పసుపుల,రుద్రవరం నూతనపల్లె గ్రామాల రైతుల నుంచి పసుపుల గ్రామంకు చెందిన పకిడి ఖాజా క్వింటాళ్లలో పొగాకు కొనుగోలు చేసి అమ్ముకుని డబ్బులు ఇవ్వకుండా పలువురు రైతులను మోసం చేస్తున్నారని కర్నూలు మండలం పసుపుల గ్రామానికి చెందిన సుల్తాన్ ఫిర్యాదు చేశారు. తమ 5 ఎకరాల పొలానికి వెళితే గుర్రం నాగన్న, వెంకటస్వామి, వెంకట్రాముడు, ఉపేంద్రలు కొట్టడానికి వస్తున్నారని, సర్వే చేయించడానికి వారు సహకరించేలా చర్యలు తీసుకోవాలని ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన కనకమ్మ ఫిర్యాదు చేశారు. కర్నూలు చెందిన రవీంద్ర అనే వ్యక్తి పాతబస్తీ, పూలబజారుకు చెందిన కొంత మంది మహిళల నుంచి ఆధార్ కార్డు, పాన్‌కార్డు, సిమ్‌కార్డు ఫోటోలు తీసుకుని ఒక్కొక్కరికి రూ.5వేల నుంచి రూ.10వేల మాదిరిగా ఇచ్చి బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేస్తూ వారికి తెలియకుండా వారి పేర్ల మీద ఏసీలు, టీవీలు, సెల్‌ఫోన్లు తీసుకుని మోసం చేస్తున్నాడని కర్నూలు వడ్డెగేరికి చెందిన షేక్ సన ఫిర్యాదు చేశారు. తమకు ప్రాణరక్షణ కల్పించి న్యాయం చేయాలని కర్నూలు మండలం సూదిరెడ్డిపల్లెకు చెందిన చిట్టెమ్మ ఫిర్యాదు చేశారు. ఫోర్జరీ పట్టాదారు పాసు పుస్తకాలు తయారు చేసుకుని రాజు, మహేష్ అనే వ్యక్తులు ఆస్తిని ఆక్రమించుకోవాలని నన్ను, తన నానమ్మను కొట్టి చంపుతామని బెదిరిస్తున్నారని ఆదోని పట్టణం రాహుల్ ఫిర్యాదు చేశాడు.

# ఆర్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం

### - రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

**కర్నూలు కల్చరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** దేశ సంస్కృతి, సంప్రదాయాలను సంరక్షిస్తూ ప్రతిరంగంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చేస్తున్న సేవలు ప్రశంసనీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. నగర శివారు మునగాలపాడు వద్ద 10 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న కేశవ స్మృతి మండలి నూతన భవన నిర్మాణానికి అచలానంద స్వామి ఆధ్వర్యంలో సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ వెంకటేశ్ ఆర్ఎస్ఎస్ ప్రతినిధులతో కలిసి భూమి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం టీజీ మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుంచే పెద్దలను గౌరవించే సంస్కృతి, దేశం పట్ల భక్తి అలవడేలా ఆర్ఎస్ఎస్ ఎంతో కృషి చేస్తోందన్నారు. బాల్యం నుంచి పిల్లల్లో క్రమశిక్షణ అలవడితే తద్వారా సమాజం, దేశం అభివృద్ధి చెంది బలంగా తయారవుతుందన్నారు. సంఘ శాఖలో క్రమశిక్షణ అలవర్చుకొని తమ కుటుంబాలను కూడా వదులుకొని సమాజం కోసమే జీవితాలను అంకితం చేసిన వారిని ఎంతో మందిని కూడా ఇక్కడ చూడవచ్చని అన్నారు. అలాంటి సంస్థ చేపట్టినటువంటి కార్యక్రమాల్లో తాను కూడా భాగస్వామ్యం కావడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు టీజీ వెంకటేశ్ తెలిపారు. సంస్థ చేపడుతున్న కేశవ స్మృతి మండలి నిర్మాణానికి తన తల్లి దివంగత శ్రీమతి గౌరమ్మ పేరు మీద ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముందుముందు కూడా ఆర్ఎస్ఎస్ సంస్థ చేపట్టే ఎటువంటి కార్యక్రమాలకైనా తన వంతుగా పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు ఉంటాయని టీజీ వెంకటేశ్ హామీ ఇచ్చారు. నూతన భవన నిర్మాణానికి టీడీపీ నాయకుడు పుసులూరు ప్రభాకర్ రెడ్డి రూ.12.35 లక్షలు విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో స్థలదాతలు భగవాన్ బాలసాయి సెంట్రల్ ట్రస్టీ రామారావు, ఆదర్శ అనంతయ్య, ఆర్ఎస్ఎస్ అఖిల భారత సేవా ప్రముఖ్ సెంథిల్, క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్, నగర మేయర్ బీవై రామయ్య, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న టీజీ వెంకటేశ్, ఆర్ఎస్ఎస్ నాయకులు

# చాగలమర్రిలో చోరీ

- నాలుగు తులాల బంగారు, 60 తులాల వెండి అపహరణ

**చాగలమర్రి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని చింతలచెరువు రహదారిలో నివాసం ఉండే బసిరునిస్సా అనే మహిళ ఇంట్లో చోరీ జరిగింది. ఈనెల 4న బసిరునిస్సా బంధువుల ఇంటికి వెళ్లింది. సోమవారం సాయంత్రం రాగా ఇంటికి వేసిన తాళం తీసిఉండటంతో ఆశ్చర్యపోయింది. ట్రంక్కు పెట్టె పగులకొట్టి నాలుగు తులాల బంగారు, 60తులాల వెండి ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దాంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

# నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

### కడపలో రోడ్డు ప్రమాదం
## ఇద్దరు ఆళ్లగడ్డవాసుల దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు



మృతుడు ఉదయ్‌కుమార్



మృతి చెందిన హుసేనమ్మ

కడప క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అరుణాచలం గిరిప్రదక్షిణ చేసుకుని సొంత గ్రామానికి వెళుతున్న సమయంలో ఆయిల్ ట్యాంకర్ రూపంలో వారిని మృత్యువు కబళించింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా మరో నలుగురు తీవ్ర గాయాలయ్యారు. మెరుగైన చికిత్స కోసం వారిని కర్నూలుకు తరలించారు. వీరందరూ కుటుంబ సభ్యులే. కడప ట్రాఫిక్ పోలీసుల వివరాల మేరకు..

ఆళ్లగడ్డలోని బాలాజీ స్ట్రీట్‌కు చెందిన దూదేకుల హుసేనమ్మ(55), కుమారుడు రాజా దస్తగిరి, కోడలు షర్మిల, మనవడు ప్రియాన్ష్‌తో పాటు షర్మిల సోదరుడు అయిన ఆళ్లగడ్డలోని ఎస్.లింగందిన్నె గ్రామానికి చెందిన దూదేకుల ఉదయ్‌కుమార్ (32), అతని తండ్రితో కలిసి శనివారం కారులో తమిళనాడులోని అరుణాచలం వెళ్లారు. గిరిప్రదక్షిణ అనంతరం తిరిగి సొంత గ్రామానికి బయల్దేరారు. కడప నగరం బైపాస్‌రోడ్డులోని శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోకి ఆదివారం రాత్రి 11.30గంటలకు రాగానే కర్నూలు నుంచి తిరుపతి వైపు వస్తున్న ఆయిల్ ట్యాంకరు ఢీకొంది. ఈ ప్రమాదంలో హుసేనమ్మ, అల్లుడి వరుసయ్యే ఉదయకుమార్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కారులో ఉన్న మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వాహనదారులు కడప ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గాయ పడ్డవారిని రిమ్స్‌కు తరలించారు. నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హుసేనమ్మ, ఉదయ్‌కుమార్ మృతదేహాలు కడప రిమ్స్ మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### 16 నుంచి గోకులాష్టమి ఉత్సవాలు

పాణ్యం, ఆగస్టు 11 : (ఆంధ్రజ్యోతి): పాణ్యంలోని శ్రీవీరనారాయణ స్వామి ఆలయంలో గోకులాష్టమి ఉత్సవాలు ఈనెల 16 నుంచి 18 వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ ఈఓ సువర్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 16వ తేదీన స్వామివారికి పూజా కైంకర్యాలు, మహానైవేద్యాది కార్యక్రమాలు, పూలంగి సేవ, గోధూళి పుష్కరాంశమందు శ్రీవారి కళ్యాణం, 17వతేదీన అన్నదాన కార్యక్రమం, 18 వతేదీన గ్రామోత్సవం జరుగుతుందని వివరించారు.

### పట్టణ సమస్యలపై ఉద్యమించాలి: సీపీఎం

ఆత్మకూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పట్టణ సమస్యలపై ప్రజలు ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్, నాయకులు రజాక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆత్మకూరులోని కిరాణం హమాలి యూనియన్ కార్యాలయం నందు నిర్వహించిన సమావేశం లో వారు మాట్లాడారు. ఆత్మకూరు మున్సిపాలిటీ గ్రేడ్-3 హోదా పొందినప్పటికీ ఇక్కడి సమస్యలు ఏమాత్రం పరిష్కారం కాలేదన్నారు. అలాగే పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉందన్నారు. ఆయా సమస్యలను మున్సిపల్ అధికారులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జబివుల్లా, రహం, నూర్, రోహన్‌వలి పాల్గొన్నారు.

### 80 బన్నూరు
### సింగిల్‌విండో చైర్మన్‌గా శ్రీనివాసులు

జూపాడుబంగ్లా,ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 80బన్నూరు సహకార పర పతి సంఘానికి సింగిల్‌విండో చైర్మన్‌గా తం గడంచ గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు పి. శ్రీనివాసులును నియమిస్తూ ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలు వడ్డాయి. త్రిసభ్య కమిటీలో చైర్మన్‌గా శ్రీనివాసులు, సభ్యుడిగా మండ్లెం గ్రామానికి చెందిన జి.తిరుపతిరెడ్డి, తరిగోపుల గ్రామానికి చెందిన పి.శేఖర్‌కు చోటు కల్పించారు. బీసీసెల్ నాయకులుగా, ప్రస్తు తం తెలుగు రైతు సంఘం మండల అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఆయన కు సింగి ల్‌విండో చైర్మన్ వరించడంతో మండల టీడీపీ నాయకులు వెంక టేశ్వర్లుయాదవ్, గిరీశ్వర రెడ్డి, మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, రామోహ్మన్‌రెడ్డి తదితరులు అభినందించారు.



### 'ఐడీబీఐ బ్యాంక్‌ను బలహీనపరచవద్దు'

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా నిర్వహి స్తున్న సమ్మెకు సంఘీభావంగా నంద్యాలలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద సోమవారం ఐడీబీఐ బ్యాంక్‌ను బలహీనపరచవద్దని నిరసన తెలి పారు. ఎల్ఐసీ యూనియన్ నంద్యాల బ్రాంచ్ కార్యదర్శి కేపీ మనోజ్, అధ్యక్షుడు రవిశంకర్‌శుక్లా ఆధ్వర్యంలో ఐడీబీఐ బ్యాంక్ ఉద్యోగులకు ఈ నిరసన కార్యక్రమం చేశారు. దేశంలో 2100 బ్యాంక్ ఖాతాలతో 4లక్షల కోట్ల రిజర్వ్ నిధులతో ఐడీబీఐ బ్యాంక్ పనిచేస్తోందన్నారు. పదేళ్లక్రితం నష్టాల్లో ఉన్న ఐడీబీఐ బ్యాంక్‌ను ఎల్ఐసీ విక్రయించి లాభాలబాటలోకి తెచ్చిందన్నారు.ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.7026 కోట్ల నిర్వహణ లాభాన్ని, రూ.209కోట్ల నికర లాభాన్ని ఐడీబీఐ సాధిం చిందన్నారు. ఇలాంటి బ్యాంక్‌ను డిజిన్వెస్ట్‌మెంట్ చేయాలనుకోవడం ప్రైవేట్, విదేశీ కంపెనీలకు ఊడిగం చేయడమే అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు హరిప్రి య, రమేష్ బాబు, రామకృష్ణుడు, శేషగిరి, షాకీర్, శ్రీవల్లి, దస్తగిరి, శివనందిని, సత్యనారాయణ, రంగనాథ్ పాల్గొన్నారు.

### అసెస్మెంట్ పుస్తకాలలోనే పరీక్షలు: ఎంఈవో

పాణ్యం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఈనెల 13వ తేదీ వరకు జరిగే పార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు అసెస్మెంట్ పుస్తకాలలోనే నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రతి విద్యార్థికి అసెస్మెంట్ పుస్తకం ప్రతి సబ్జెక్టుకు సంబంధించి మండలంలో 4529 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. పరీక్షలు అసెస్మెంట్ పుస్తకంలోనే రాయాల్సి ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి వివరాలు, పూర్తి సమాచారం, ప్రాజెక్టు పనులు, ఈ పుస్తకంలో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే ఈ పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

### విద్యార్థులకు యంత్రాలపై
## అవగాహన అవసరం

పాణ్యం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులకు వ్యవసాయ యంత్రాలపై పూర్తిగా అవగాహన అవసరమని అనంతపురం దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షణ సంస్థ ఇంజనీరు బీవీ రమణ అన్నారు. సోమవారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు వ్యవసాయ యంత్రాలపై ఆ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఇంజనీర్లు బి వెంకటరమణ, భాస్కరరావు, హెచ్ఓడీ తిరుపతిరెడ్డి, కో ఆర్డినేటర్ చంద్రశేఖర్, డాక్టర్ హుశేన్‌వలి, ఎంసీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దంచికొట్టిన వాన

- వాగులు, వంకలు ఏకం
- ఊపిరి పీల్చుకున్న రైతులు
- లోతట్టు ప్రాంతాలు జలమయం

వరుణుడు కరుణించాడు.. కుంభవృష్టి కురిపించాడు.. నీటి కొరత తీర్చాడు.. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.. ఈ వానతో పైర్లకు చాలా మేలవుతుందని రైతుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో ఇదే ఇప్పటి వరకు అతిపెద్ద వర్షం. అయితే లోతట్టు ప్రాంతాలు మాత్రం జలమయమయ్యాయి. డ్రైనేజీలు, లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించి అక్కడి సమస్యలు తీర్చాలని అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రజా సంఘాల నాయకులు విన్నవిస్తున్నారు.



తూడిచర్ల పొలిమేరలో మొక్కజొన్న పంటలో నిలిచిన వర్షపు నీరు

నందికొట్కూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలో ఆదివారం రాత్రి వర్షం దంటి కొట్టింది. నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇదే ఇప్పటి కురిసిన అతిపెద్ద వర్షం. ఈ వర్షంతో నియోజకవర్గంలోని వాగులు, వంకలు ఏకమయ్యాయి. ఎన్నో రోజులుగా వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతన్న కళ్లల్లో వరుణుడు కరుణించి ఆనందాన్ని నింపాడు. మొక్కజొన్న, ఉల్లి, మిరప, పత్తి తదితర పంటలకు ఈ వర్షం ఎంతగానో మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. ఇక రబీ పంట అయిన పొగాకును రైతులు సాగు వేస్తున్నారు. మిడ్తూరు, పగిడ్యాల మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. నందికొట్కూరు మండలంలో 131.4 మి.మీటర్ల మేర వర్షపాతం జిల్లాలోనే అత్యధికంగా నమోదైంది. వెలుగోడు మండలంలో 118.2 మి.మీటర్లు, పాములపాడులో 96.8 మి.మీటర్లు, జూపాడుబంగ్లాలో 94.8 మి.మీటర్లు, కొత్తపల్లి మండలంలో 94.4 మి.మీటర్లు, మిడ్తూరు మండలంలో 68.4 మి.మీటర్లు, పగిడ్యాల మండలంలో 46.8 మి.మీటర్లు వర్షపాతం నమోదైంది. కాగా నందికొట్కూరు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మారుతీనగర్, హాజీనగర్ లోని లోతట్టు ప్రాంతాలు, డ్రైనేజీలు రోడ్డుపై పొంగి పొర్లాయి. జాతీయ రహదారి ఎగువ పంట పొలాల నుంచి వచ్చే వరద జలాలను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. లోతట్టు ప్రాంతంలో ఉన్న కాలనీలను ఆమె పరిశీలించారు. సహాయక చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు.

మిడ్తూరు మండలం చెరుకుచర్ల వద్ద కుందునదీ, మిడ్తూరు గ్రామం వద్ద కాకిలేరు వాగు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో ప్రయాణికుల రాకపోకలు అంతరాయం ఏర్పడింది. అదే విధంగా మిడ్తూరు మండలంలోని చౌట్కూరు, తలముడిపి, చింతలపల్లి గ్రామాల్లోని వాగులు, వంకలు పొంగి పొర్లాయి.

**కాలనీలకు ముంపు ముప్పు తప్పడంలేదు: సీపీఎం**

నియోజకవర్గ కేంద్రమైన పట్టణంలో ఐదుగురు ఎమ్మెల్యేలు మారినా మున్సిపాల్టీకి వరద ముప్పు తప్పడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు అన్నారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలోని హాజీనగర్, మారుతీనగర్ కాలనీల్లో రోడ్డు మీద ప్రవహిస్తున్న నీటిని సోమవారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు మున్సిపాల్టీలోని మారుతీనగర్, హాజీ నగర్, విలేకరు కాలనీ, ప్రభుత్వ హాస్పిటల్ తదితర కాలనీల్లో వర్షపు నీరు వెళ్లేందుకు డ్రైనేజీ కాలువలు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటివరకు ఐదుగురు ఎమ్మెల్యేలు మారినా డ్రైనేజీ కాలువల ఏర్పాటు కాకపోవడం ప్రజాప్రతినిధుల బాధ్యతారాహిత్యానికి అద్దంపడుతోందన్నారు. వర్షాకాలంలో ఇళ్లల్లోకి నీరు చేరి నిత్యం ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారు లు విచ్చలవిడిగా పన్నులు వేయడం తప్ప అభివృద్ధి వైపు దృష్టి సారించడం లేదన్నారు. ఇంత వరద ప్రవహిస్తున్నా ఏ ఒక్క ప్రజాప్రతినిధీ ఇక్కడి రాకపోవడం విచారకమన్నారు. డ్రైనేజీ వ్యవస్థకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, పక్కీర్ సాహెబ్, ఉస్మాన్ భాష, ఆర్.జయరాణి, జేమ్స్ శ్రీను పాల్గొన్నారు

**పాములపాడులో 98.6 మి.మీ.ల వర్షపాతం**

పాములపాడు: పాములపాడు మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. 98.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండలంలోని వేంపెంట గ్రామ శివార్ల లోని చెంచుకాలనీలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో చెంచులు ఇబ్బందులు పడ్డారు.

**వర్షానికి కూలిన మట్టిమిద్దె.. తప్పిన ప్రమాదం**

నందికొట్కూరు: నందికొట్కూరులో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పట్టణంలో ఓ మట్టి మిద్దె కూలింది. పింజరి పేట లోని సిద్దయ్యకు చెందిన మట్టి మిద్దె పాతది కావడంతో ఆయన మరో ఇంట్లో అద్దెకు ఉంటు న్నాడు. రాత్రి వర్షం కురవ డంతో తన మిద్దె కూ లింది. ఆ సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

**వర్షం నీటితో విద్యార్థులకు ఇబ్బందులు**

పగిడ్యాల: మండల పరిధిలోని పడమర ప్రాతకోటలోని ఎంపీపీ పాఠ శాల ఆవరణంలో వర్షం నీరు నిలవడంతో విద్యార్థు లు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ పార్టీ మం డల కార్యదర్శి అబ్దుల్ మజీద్ పేర్కొన్నారు. సీపీఐ నాయకులు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను సో మవారం సందర్శించి అక్కడి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి వర్షం కురిసినా పాఠశాల ఆవరణంలో వర్షం నీరు నిలవడంతో విద్యార్థులు తరగతి గదులకు నీటిలోనే వెళ్లాల్సి వచ్చిందన్నారు.

**జూపాడుబంగ్లాలో పంట పొలాల్లోకి నీరు**

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా మండలంలో ఆదివారం రాత్రి నుంచి తెల్లవారేవరకు భారీ వర్షం కురిసింది. 94.8 మి.మీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ వర్షానికి పారుమంచాల వద్ద ఇసుకవాగు, కాకిలేరువాగు ఉప్పొంగి ప్రవహిం చాయి. ఇసుకవాగు పారుమంచాల ప్రధాన రహ దారిపై ఉప్పొంగి ప్రవహించడంతో 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇసుకవాగు ఉప్పొంగడంతో నందికొట్కూరు కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సురాక పోవడంతో వెళ్లలేకపోయారు. ఇసుకవాగుపై నిర్మించే పనులన్నీ నీట మునిగాయి. వాగులు, వంకల ప్రవహించడంతో తంగడంచ, పారుమంచాల, పి.లింగాపురం, తూడిచర్ల గ్రామాల్లోని మొక్కజొన్న, పత్తి పొలాల్లో వర్షపునీరు నిలవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**కొత్తపల్లిలో వర్షం.. కర్షకుల హర్షం**

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలో భారీ వర్షం కురిసింది. మండలంలో 90.8 మి.మీల వర్షపాతం నమోదైంది. పొలాల్లోకి వర్షం నీరు భారీగా చేరింది. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండటంతో రోడ్లపైకి నీరు చేరింది.

గడివేముల: కుందూనది పరివాహక ప్రాంతంలో ఉన్న మొక్కజొన్న, సోయాచిక్కుడు, బెండ, వరి పొలాలు నీటి మునిగాయి. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల సోయా చిక్కుడు పంట పూర్తిగా దెబ్బతిందని ఈ సందర్భంగా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**వర్షం పడితే వణుకే**

నంద్యాల రూరల్: నంద్యాలలో పట్టణంలోని భైటిపేటలో వాన నీరు ఇళ్లలోకి చేరుకుంది. పాములు ఇళ్లలోకి ప్రవేశించాయి.నీరు తగ్గే వరకు పంట పొలాలకు వెళ్లేందుకు వీలులేదు. అంతలోపు పంటలు దెబ్బతినే అవకాశముంది.

**ఆత్మకూరులో 52.8మి.మీ. వర్షపాతం**

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రాంతంలో సోమవారం తెల్లవారుఝామున భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా వర్షం కురియడంతో 52.8మిమీల వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు ప్రాంతంలో ఈ ఏడాదిలోనే ఈ వర్షం అత్యధికంగా కురిసినట్లు తెలుస్తోంది. దీంతో పట్టణంలోని పలు లోతట్టు కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు కొంత అసౌకర్యానికి లోనయ్యారు. వరదరాజ స్వామి ప్రాజెక్టుకు వెళ్లే రహదారిలో ఉన్న వాగు కూడా ఉధృతంగా ప్రవహించింది. నల్లమలలోని వాకలు, వంకల్లో నీటి ప్రవాహం కొనసాగింది.

**వెలుగోడులో 118.2**

వెలుగోడు: వెలుగోడులో 118.2 మిల్లి మీటర్లగు నమోదైంది. ఊటకాల్వ పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచి పోయాయి. వెలుగోడు వేల్పనూరు గ్రామాల మధ్య మంచినీళ్ల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలచి పోయాయి. బస్సులు నిలిచిపోయాయి. రేగడగూడూరులో వర్షపు నీరు పలు కాలనీలను ముంచెత్తింది.



మిడ్తూరు మండలం చెరుకుచర్ల గ్రామం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న కుందూనది



నంద్యాల రూరల్: ఇళ్ల వద్దకు చేరుకున్న వరద నీరు



పారుమంచాల గ్రామం వద్ద ప్రధాన రహదారిపై ఉప్పొంగి ప్రవహిస్తున్న ఇసుకవాగు



కొత్తపల్లిలో మొక్కజొన్న పంటలో వర్షపు నీరు



నందికొట్కూరు: రోడ్డుపై ప్రవహిస్తున్న వాననీరు



వెలుగోడు: పొంగి ప్రవహిస్తున్న మంచినీళ్ల వాగు



పగిడ్యాల: వర్షం నీటిని చూపుతున్న సీపీఐ నాయకులు

## శాంతిసౌభాగ్యాలతో జీవించాలి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ శాంతి, సౌభాగ్యాలతో కలిసిమెలసి జీవించాలని బ్రహ్మకుమారీలు అన్నారు. సోమవారం ప్రజాపిత ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ విద్యాలయానికి చెందిన బ్రహ్మకుమారీలు కలెక్టర్ రాజకుమారిగణియాకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిద్ర లేవగానే భగవంతున్ని ప్రార్థించుకుని కార్యక్రమాలు ప్రారం భించాలని కోరారు. ఈర్ష, పగ, ప్రతీకారం వంటి ద్వేశాలను పూర్తిగా తొలగించుకుని సోదరభావంతో కలిసిమెలసి జీవించాలన్నదే రక్షాబంధన్ ఉద్దేశ్యమన్నారు.

**హర్ ఘర్ తిరంగాలో అందరూ పాల్గొనాలి**

స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా నంద్యాలలో నేడు నిర్వహించే హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కలెక్టర్ రాజకుమారి గణియా కోరారు. పీజీఆర్ఎస్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామంలో, పట్టణంలో నిర్వహించే హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో పౌరులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా అమృత్ సరోవర్ పనులు జరిగిన ప్రాంతాల్లో ఫోటోలు దిగి సం బంధిత సైట్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలను త్రివర్ణ రంగులతో కూడిన దీపాలతో అలంకరించాలన్నారు. నేడు మార్కెట్‌యార్డు నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

## స్వాతంత్ర్య స్ఫూర్తిని అలవర్చుకోవాలి




ఆత్మకూరులో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ స్వాతంత్ర్య స్ఫూర్తిని అలవర్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, సింగిల్ విండో సొసైటీ చైర్మన్ షాబుద్దీన్, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా పేర్కొన్నారు. ఈ మేరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆత్మకూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి గౌడ్ సెంటర్, కేజీరోడ్డు మీదుగా రఘునాథ్ సెంటర్‌కు చేరుకుని అక్కడి నుంచి తిరిగి గౌడ్‌సెంటర్ సర్కిల్‌కు వచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామ్మూర్తి, గౌస్‌ఆజం, రఫీక్, న్యామత్, మన్సూర్ ఉన్నారు.

**ప్రతి ఇంటిపై జాతీయజెండా ఎగురవేయాలి**

ఆత్మకూరు రూరల్: ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటి మీద జాతీయజెండాను ఎగుర వేయాలని వెంకటాపురం గ్రామ సర్పంచ్ మహానంది గంగాదేవి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ గ్రామస్థులను కోరారు. సీఎం చంద్రబాబు, పీఎం నరేంద్రమోదీ పిలుపు మేరకు సోమవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా వెంకటాపురం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకులు రాజేంద్రారెడ్డి, సచివాలయ ఉద్యోగులు, అంగన్ వాడి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### వర్షం కురవాలని రైతుల పూజలు

పాములపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురిసి పంట పొలాలు సమృద్ధిగా పండాలని కోరుతూ రైతులు అలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి జలాభిషేకం నిర్వహించారు. పాములపాడులో సోమవారం రైతులు స్థానిక శివాలయంలో శివలింగం మునిగే వరకు నీళ్లు పోశారు. అలాగే గ్రామంలోని చౌడేశ్వరిదేవీ ఆలయంలో అమ్మవారికి, నాగులకట్టకు, గ్రామ పొలిమేర దేవతలకు తప్పెట్లతో ఊరేగింపుగా వెళ్లి జలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు నాగమల్లారెడ్డి, శివనాగిరెడ్డి, వెంకటరామరెడ్డి, సాయిక్రిష్ణ, కురువ వెంకటేశ్వర్లు, రాజు, సుబ్బారెడ్డి, సునీల్, చింటు, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

### హంద్రీనీవా పూర్తి ఆయకట్టుకు నీరందించాలి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా పూర్తి ఆయకట్టుకు నీరు అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కార్యాచరణ చేపట్టాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరధరామిరెడ్డి కోరారు. నంద్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బొజ్జా మాట్లాడుతూ 40 యేళ్ల క్రితం 3850 క్యూసెక్కుల సామర్థ్యంతో ప్రారంభమైన హంద్రీనీవా ప్రాజెక్టు నేటికీ నత్తనడకను తలపిస్తోందన్నారు. నేడు 3250 క్యూసెక్కుల నీటిని ప్రధాన కాల్వలో ప్రవహించేలా కృషిచేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రాజెక్టు లక్ష్యం ఆరు లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సివుండగా 15శాతం ఆయకట్టుకు కూడా నీరందని దుస్థితి నెలకొందన్నారు. ప్రాజెక్టులో భాగంగా మొదటి దశలో పందికోన రిజర్వాయర్ ద్వారా కరువు పీడిత పశ్చిమ కర్నూలు జిల్లా ప్రాంతంలో 61,400 ఎకరాలకు నీరందించాలని, కానీ నేటికీ 10వేల ఎకరాలకు కూడా నీరు అందించలేని పరిస్థితి ఉందన్నారు. 2014లో డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లో 106 చెరువులకు హంద్రీ నీటితో నిం పుతామని హామీ ఇచ్చిన టీడీపీ ప్రభుత్వమే నేడు 66 చెరువులకు కుదించిందన్నారు. ఇప్పటికైనా సంబంధించి రిజర్వాయర్ల పూర్తి స్థాయి నిర్మాణాలు చేపట్టి హంద్రీనీవా ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీటిని అందించాలని ఆయన కోరారు.

## గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించాలి: ఎమ్మెల్యే

కొత్తపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజల అర్జీలను స్వీకరించారు. టీడీపీ నేత మోహన్ యాదవ్ కొత్తపల్లి గ్రామ శివార్లలో గాలీవానకు విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి తీగలు కిందకు వేలాడుతున్నా ఏఈ పట్టించుకోవడం లేదని తెలిపారు. సీసీ రోడ్లకు సంబంధించిన ప్రతిపాదనలు, గ్రామ పంచాయతీల తీర్మాణాలు త్వరగా పంపిస్తే నిధులు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే పంచాయతీరాజ్ ఏఈ మద్దిలేటిని ఆదేశించారు. తహసీల్దార్ ఉమారాణి, ఇన్‌చార్జి ఎంపీడీవో ఆలంబాషా, డీటీ పెద్దన్న, ఏపీవో విమలమ్మ, సింగిల్ విండో చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, నాయకులు నారపురెడ్డి, లింగస్వామి గౌడు, మహేశ్వరరెడ్డి, అమర్నాథ్ యాదవ్, జానకీ రాముడు తదితరులు ఉన్నారు.

- టీడీపీ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

కొత్తపల్లిలో మృతిచెందిన టీడీపీ కార్యకర్త గంగాధర్ యాదవ్ కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే జయసూర్య భరోసా ఇచ్చారు. సోమవారం కొత్తపల్లికి చేరుకుని గంగాధర్ మృతదేహానికి నివాళులర్పించారు. ఈయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

## రైతు సంబరాలను విజయవంతం చేయండి



మార్కెట్ యార్డులో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

**డోన్ టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** రైతు విజయోత్సవ సంబరాల సభను ఈ నెల 13న నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో స్థలాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఏర్పాట్లపై మార్కెట్ యార్డు సెక్రటరీ మాదవక్ష్మారెడ్డి చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, లక్కసాగరం లక్ష్మిరెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, నాయకులు పెద్ద కేశవయ్య గౌడు, టీఈ కేశన్న గౌడు, ఓంప్రకాష్, భాస్కర్ నాయుడు, పీఏసీ చైర్మన్లు చిన్నపూజర్ల ఎల్లాగౌడు, ఉన్నం చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, కేడీసీఎం మేనేజర్ రాఘవేంద్ర రెడ్డి, పాల్గొన్నారు.

### వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సూచించారు. సోమవారం డోన్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోట్ల సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు కోట్రికే ఫణిరాజ్, సందు వెంకటరమణ, అంజనేయగౌడు, కృష్ణరావు, వీహెచ్‌పీ తిమ్మారెడ్డి, ఈశ్వర్ నాయుడు, జే.శ్రీనివాసులు, వీహెచ్‌పీ శ్రీరామ్, దుర్గం అంబికేశ్వర్, సముద్రాల ప్రసాద్ ఉషారాణి పాల్గొన్నారు.

## కొత్త మండలంగా ఏర్పాటు చేయాలి

**ప్యాపిలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :** కొత్త మండలంగా జలదుర్గం గ్రామాన్ని ఏర్పాటు చేయాలని సీఐటీయూ, ఆవాజ్ కమిటీ నాయకులు జలదుర్గం రసూల్, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ, ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో సంతకాలు సేకరించారు. ఇచ్చిన మాట ప్రకారం టీడీపీ ప్రభుత్వం నూతన మండలంగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జయరామయ్య, దామోదర్, పెద్దన్న, శివారెడ్డి, మహేంద్ర, రాశిపోగులు నాగేశ్వరరావు, ప్రతాప్ పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలి

**ప్యాపిలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :** ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గ్రామంలో ఆశా వర్కర్ల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి చిన్నరహిమాన్, ఆశా వర్కర్లు లక్ష్మీదేవి, కృష్ణవేణి, రామలక్ష్మి, దేవమ్మ పాల్గొన్నారు.

## రుద్రవరం సహకార సంఘం చైర్‌పర్సన్‌గా హేమలత



**రుద్రవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ముత్తలూరు గ్రామానికి చెందిన హేమలతను రుద్రవరం సహకార సంఘం చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. సోమవారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు ఆమె బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. హేమలతను ఎమ్మెల్యే సన్మానించారు. రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తామన్నారు.

## సింగిల్ విండో చైర్మన్‌గా విజయభాస్కర్‌రెడ్డి



**అవుకు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :** అవుకు సింగిల్ విండో చైర్మగా చల్లా విజయభాస్కర్‌రెడ్డిని నియమించినట్లు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రెండు సార్లు అవుకు సింగిల్ విండో చైర్మన్‌గా పనిచేసిన చల్లా విజయభాస్కర్‌రెడ్డి మూడవసారి ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా దూదేకుల సిద్దయ్య, వెంకటనారాయణస్వామి నియమితు లయ్యారు. తనపై నమ్మకంతో విండో చైర్మన్‌గా నియమించటంపై సీఎం చంద్రబాబుకు, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలి పారు.

## బాధితురాలికి చెక్కు అందజేత

**చాగలమర్రి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** బాధితకుటుంబానికి మంజూరు అయిన రూ. 4.50లక్షల చెక్కును కలెక్టర్ రాజకుమారి సోమవారం అందజేశారు. 2024లో మట్టిమిద్దె కూలి చిన్నవంగలి గ్రామానికి చెందిన గురుశేఖర్‌రెడ్డి, దస్తగిరమ్మ దంపతులతో ఇద్దరు కుమార్తెలు మృతి చెందారు. ఈ సంఘటనలో మరో కుమార్తె గురుప్రసన్న ప్రాణపాయం నుంచి బయటపడింది. ఆర్థిక అక్షరాస్యత ఎన్‌జీవోలు తెలుసుకొని బాధిత కుటుంబానికి అండగా నిలిచి ప్రభుత్వ సాయం అందేలా కృషి చేశారు. కార్యక్రమంలో జేసీ హరికిరణ్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రవీంద్రకుమార్, ఏపీజీబీ రీజినల్ మేనేజర్ వెంకటరమణ, ఎస్ఎస్‌టీ జిల్లా కో-ఆర్డినేటర్ నబీ రసూల్, కౌన్సిలర్లు అనిల్‌కుమార్, మనోహర్, టీడీపీ నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

## రైతులకు మెరుగైన సేవలు అందించాలి

**శిరివెళ్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) :** వ్యవసాయ సహకార సంఘాల పరిధిలోని రైతులకు చైర్‌పర్సన్, కమిటీ సభ్యులు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సూచించారు. యర్రగుంట్ల గ్రామ సొసైటీ చైర్మన్‌గా తపసి శ్రీరాములు, డైరెక్టర్లుగా శీలం రామ్మోహన్, షేక్ హుసేన్ బాషా నియమితులు కావడంతో వారు ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ-2 కమతం జయరామిరెడ్డి, శీలం లక్ష్మీప్రసాద్, అంజనేయులు పాల్గొన్నారు.

# కుండపోత వర్షం

- జలమయమైన కార్యాలయాలు, రహదారులు
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు, వక్కిలేరు
- చాగలమర్రిలో 32.3 మీ.మీ వర్షపాతం నమోదు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం



చాగలమర్రిలో జలమయమైన పశువైద్యశాల రహదారి

**చాగలమర్రి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** ఆయా గ్రామాల్లో కుండపోత వర్షం సోమవారం కురిసింది. ప్రభుత్వ కార్యాలయాలు, వైద్యశాలలు, పాఠశాలల ప్రాంగణాలు, పలు రహదారులు వర్షపు నీటితో జలమయమయ్యాయి. చాగలమర్రి మండలంలో 32.3 మీ.మీ వర్షపాతం నమోదైంది. బ్రాహ్మణపల్లె, కలుగొట్లపల్లె, వక్కిలేరు ఉధృతంగా ప్రవహించింది. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. గోపాయపల్లె రహదారిలోని అడ్డవాగు పొంగి ప్రవహించి రహదారి నీటి కుంటగా మారడంతో కూలీలు, రైతులు, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కురిసిన వర్షం ఎండుతున్న పంటలకు జీవం పోసినట్లైందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

**● కుందూలో పెరిగిన నీటి ఉధృతి**

చాగలమర్రి మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రాజోలి ఆనకట్టవద్ద కుందూ ఉధృతి పెరిగింది. సోమవారం ఆనకట్ట వద్ద 17,500 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. కుందూ ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఆనకట్ట ఐదు గేట్లను ఎత్తి కడప జిల్లా వైపునకు వరద నీటిని విడుదల చేశామన్నారు. పరిసర గ్రామా ల ప్రజలు, కూలీలు, రైతులు కుందూ నది దాటే ప్రయత్నం చేయరాదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**చిలకలూరు నేలవంతెనపై..**

**రుద్రవరం:** మండలంలోని చిలక లూరు నేలవంతెనపై వరద పొంగి ప్ర వహించింది. రాకపోకలకు గ్రామస్థులు ఇబ్బంది పడ్డారు. మండలంలో 13.8 మీమీ., వర్షపాతం నమోదైంది. నల్లమల అడవిలో అధిక వర్షం కురి యడంతో వాగులు వంకలు పొంగి పొర్లాయి. నేలవంతెన స్థానంలో పైవంతెన నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**నిలిచిపోయిన రాకపోకలు**

**కోవెలకుంట్ల:** మండల పరిధిలోని లింగాల-వల్లంపాడు గ్రామాల మధ్య చిన్న వంచన వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అటు వైపు ఎవరూ వెళ్లరాదని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**శాంతించిన వాగులు**

**సంజామల:** ఉప్పొంగిన పాలేరు, గోండ్ర వాగులు సోమవారం శాంతించాయి. దాంతో ఆటోలు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించారు. వాగు ఉధృతి తగ్గినప్పటికీ కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో బస్సులు నడవలేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే పాలేరువాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ముదిగేడు, ముక్కమల్ల, కమలపురి, ఎగ్గోని, ముచ్చలపురి, కొత్తపేట, సంజా మల గ్రామాల్లో వరి పంట వరద ముంపునకు గురైంది. రెండు రోజులుగా వరద నీటితో మునిగి పోవడంతో పంట కుళ్లిపోయి నష్టం వాటిల్లిందని వరి రైతులు వాపోతున్నారు.



చిలకలూరు సమీపంలో పొంగి ప్రవహిస్తున్న వకుళానది



సంజామల సమీపంలో నీట మునిగిన పంట



వల్లంపాడు - లింగాల గ్రామాల మధ్యలో ఉధృతంగా ప్రవహిస్తున్న చిన్నవంచవాగు

## చెరువును తలపిస్తున్న క్రీడా మైదానం



కుంటను తలపిస్తున్న పాఠశాల ప్రాంగణం

**కొలిమిగుండ్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం మురుగు కుంటలా మారింది. వర్షం నీరు పాఠశాల ఆవరణంలో నిలిచిపోయి చెరువును తలపిస్తోంది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దోమలకు నిల యంగా మారడంతో పాటు, దుర్వాసన వెద జల్లుతోంది. కొలిమిగుండ్ల ఉన్నతపాఠశాలలో కోట్లాది రూపాయల నిధులతో నాడు-నేడు పనులు చేపట్టినా, డ్రైనేజీ వ్యవస్థపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. విద్యార్థులు మైదానంలో ఆడుకోవాలన్నా, తరగతి గదుల బయట తిరగాలన్నా ఇబ్బందిగా మారిం దని వాపోతున్నారు. మరోవైపు సమీపంలోనే వంట గది ఉండటంతో అక్కడే విద్యార్థులు భోజ నాలు కూడా చేస్తుంటారు. ఏడేళ్ల క్రితం పాఠశా ల పక్కనే మీర్జాపురం రహదారి నిర్మాణ సమయంలో వరద నీటి ప్రవాహానికి డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో ఈసమస్య తలెత్తింది. అయితే సమస్యను అటు ప్రభుత్వం, ఇటు విద్యాశాఖ అధికారులు అలాగే వదిలేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభు త్వమైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## కుంగిన కల్వర్టు

**రుద్రవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ కల్వర్టు తెలుగు గంగ బ్లాక్‌చానెల్ -20పైన నిర్మించారు. ఆ కల్వర్టు కుంగి ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కృంగిన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

## రహదారి నిర్మాణానికి మోక్షం ఎప్పుడో?

**రుద్రవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని చిన్నకంబలూరు మెట్ట - శిరివెళ్ల మధ్య 2.25 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రహదారిలో గుంతల మయంగా మారింది. వర్షం వస్తే గుంతల్లో నీరు చేరుతోంది. దాంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై ప్రయాణించేందుకు వాహనదారులు జంకుతున్నారు. ఈ రహదారి నిర్మాణానికి మోక్షం ఎప్పుడొస్తుందోనని చర్చించుకుంటున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఘోరం

- కడపలో రోడ్డు ప్రమాదం
- ఇద్దరు ఆళ్లగడ్డ వాసుల దుర్మరణం
- అరుణాచలం వెళ్లివస్తుండగా ఘటన



మృతి చెందిన ఉదయ్‌కుమార్



మృతి చెందిన హుసేనమ్మ



రోడ్డు ప్రమాదానికి గురైన కారు

**కడప క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** అరుణాచలం గిరి ప్రదక్షిణ చేసుకుని సొంత గ్రామానికి వెళుతున్న సమయంలో వారిని ఆయిల్ ట్యాంకర్ రూపంలో మృత్యువు కబళించింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మరణించగా మరో నలుగురు తీవ్ర గాయాలపాలై మెరుగైన చికిత్స కోసం వారిని కర్నూలుకు తరలించారు. వీరందరూ కుటుంబసభ్యులే. కడప ట్రాఫిక్ పోలీసుల వివరాల మేరకు.. ఆళ్లగడ్డలోని బాలాజీ స్ట్రీట్‌కు చెందిన దూదేకుల హుసేనమ్మ(55), కుమారుడు రాజా దస్తగిరి, కోడలు షర్మిల, మనవడు ప్రియాన్ష్‌తో పాటు షర్మిల సోదరుడు అయిన ఆళ్లగడ్డలోని ఎస్.లింగందిన్నె గ్రామానికి చెందిన దూదేకుల ఉదయ్‌కుమార్ (32), అతని తండ్రి పిల్లలతో కలిసి శనివారం కారులో తమిళనాడులోని అరుణాచలం వెళ్లారు. గిరిప్రదక్షిణ అనంతరం తిరిగి సొంత గ్రామానికి బయల్దేరారు. కడప నగరం బైపాస్ రోడ్డులోని శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోకి ఆదివారం రాత్రి 11.30గంటలకు రాగానే కర్నూలు నుంచి తిరుపతి వైపు వస్తున్న ఆయిల్ ట్యాంకరు ఢీకొంది. ఈ ప్రమాదంలో హుసేనమ్మ, అల్లుడు వరుసయ్యే ఉదయకుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వాహనదారులు కడప ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గాయపడ్డవారిని రిమ్స్‌కు తరలించారు. నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హుసేనమ్మ, ఉదయ్‌కుమార్ మృతదేహాలు కడప రిమ్స్ మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# జంబులదిన్నె బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు

- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ
- శ్మశాన వాటిక రహదారి నిర్మాణానికి ఆదేశం



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):** మండలంలోని జంబులదిన్నె గ్రామంలో వకులా నదిపై బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. 'ఆఖరికి అవస్థలే' శ్మశానానికి వెళ్లాలంటే నది దాటాల్సిందే అనే వార్తను 'ఆంధ్రజ్యోతి' సోమవారం ప్రచురించింది. దాంతో ఎమ్మెల్యే స్పందించి సోమవారం గ్రామానికి చేరుకొని సమస్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థుల ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటరెడ్డితో చర్చించారు. శాశ్వత బ్రిడ్జి నిర్మాణానికి పనులు చేపట్టాలని ఆదేశించారు. రూ 40 లక్షల వరకు బ్రిడ్జి నిర్మాణానికి ఖర్చు అవుతుందని అధికారులు తెలియజేశారు. వెంటనే కలెక్టర్‌తో మాట్లాడి నిధులు మంజూరుకు చర్యలు తీసుకున్నారు. త్వరలోనే లోలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేయిస్తామని గ్రామస్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

**సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ**

సీఎం సహాయనిధి నుంచి నియోజకవర్గంలోని పలు మండలాల బాధితులకు మంజూరు అయిన రూ 9.20లక్షల చెక్కులను సోమవారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పంపిణీ చేశారు. 18 మంది కుటుంబాలకు చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే అఖిలప్రియకు బాధిత కుటుంబాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

**చాగలమర్రి:** సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.52 వేల చెక్కును బాధితురాలు వెంకటలక్ష్మీదేవికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అందజేశారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, టీడీపీ నాయకులు అన్సర్‌బాషా, గుత్తి నరసింహులు, ఓబులేసు, పీరయ్య ఉన్నారు.

## ఎరుకుల కాలనీకి ఏకలవ్యుడి పేరు పెట్టాలి

**ప్యాపిలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :** పట్టణంలోని ఎస్‌బీఐ వెనుక వైపు ఉన్న ఎరుకుల కాలనీకి ఏకలవ్యుడి కాలనీగా నామకరణం చేయాలని ఏకలవ్య సేవా సమితి నాయకురాలు మనోరమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏకలవ్య సేవా సమితి ఆధ్వర్యంలో పలువురు ఎరకులు ఈవో శివకుమార్‌కు వినతి ప్రతం అందజేశారు. నాయకులు శేషాద్రీ, శ్రీనివాసలు, శేఖర్ పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వినియోగించాలి

**ప్యాపిలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :** ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించాలని డిప్యూటీ తహసీల్దారు కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రవి కుమార్, సంతోష్, అభిషేక్, రైతులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలి

**చాగలమర్రి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద మంజూరైన గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకుంటే తక్షణమే బిల్లులు చెల్లిస్తామని హౌసింగ్ ఏఈ నవీన్ లబ్ధిదారులకు సూచించారు.సోమవారం ఆయన మాట్లాడుతూ మంజూరైన గృహాలకు లబ్ధిదారులు నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు.

## 220 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యం

**చాగలమర్రి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** మండలంలో ఉపాధిహామీ పథకం ద్వార పండ్ల తోటల సాగు 220 ఎకరాలు లక్ష్యంగా ఉందని ఏపీవో ఖాసీంసాహెబ్ తెలిపారు. సోమవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 75 ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు రైతులు ముందుకు వచ్చారని తెలిపారు. పండ్ల తోటల సాగు వైపు రైతులు దృష్టిసారించాలన్నారు.

## ప్రత్యేక దృష్టి సారించాలి

**శిరివెళ్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) :** చిన్నారుల్లో నులిపురుగుల నివారణ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర పరిశీలకుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం శిరివెళ్లలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. జిల్లా ప్రోగ్రాం అధి కారి జగదీష్‌చంద్రారెడ్డి, వైద్యుడు ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## వ్యాధులు ప్రబలకుండా చూడాలి

**బేతంచెర్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ కోరారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐనాయకులు ఉదయ్, ప్రదీప్, మధు, రవి, శ్రీమన్నారాయణ, దేవరాజు, సురేష్ పాల్గొన్నారు.

## బటన్ హోల్ ఆపరేషన్లు చేయాలి

**డోన్ రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో బటన్‌హోల్ ఆపరేషన్లు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్ యాదవ్ కోరారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ హనీఫ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు పృథ్వీ కుమార్, హరి, ఏఐటీయూసీ నాయకులు అబ్బాస్ పాల్గొన్నారు.



## నిరుపేదలకు పెళ్లి కానుకలు పంపిణీ



పెళ్లికానుకలు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

**బనగానపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** పేద కుటుంబాలకు చెందిన పలువురికి పెళ్లికానుకలు మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అందజేశారు. సోమవారం పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాల యంలో నవవధువుల పెద్దలకు పెళ్లి కానుకలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేదలు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సహకార సంఘం అధ్యక్షుడిగా తులసి రెడ్డి



తులసి రెడ్డి

**సంజామల, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి):** పేరుసోమల సహకార సంఘం అధ్యక్షుడిగా మంచాల తులసి రెడ్డిని నియమించారు. రామిరెడ్డిపల్లె గ్రామా నికి చెందిన మంచాల తులసి రెడ్డి టీడీపీలో సీనియర్ నాయకుడిగా కొనసాగుతున్నారు. రెండు దశాబ్దాలుగా పార్టీకి సేవ చేస్తూ వచ్చారు. ఈ మే రకు పార్టీ అధిష్ఠానం తులసి రెడ్డిని పేరుసోమల సహకార సంఘం అధ్యక్ష పదవికి ఎంపిక చేశారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. సహకార సంఘం అధ్యక్ష పదవి వరించినందుకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## రాహుల్‌గాంధీని అరెస్టు చేయడం దారుణం

**డోన్ రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):** కాంగ్రెస్ అధినేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీని ఢిల్లీలో అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గార్లపాటి మద్దిలేటి అన్నారు. సోమవారం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మద్దిలేటి మాట్లాడుతూ ఓటర్ల జాబితా తప్పులపై పోరాడుతున్న రాహుల్ గాంధీని చూసి బీజేపీకి భయం పట్టుకుందన్నారు. నాయకులు మల్లెంపల్లె జనార్దన్, మహబూబ్ హుశేన్, రవిశేఖర్, మహేంద్ర నాయుడు, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

## నేడు నాయీబ్రాహ్మణుల కృతజ్ఞత సభ

**బనగానపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):** బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నాయీ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు శ్రీరాములు సోమవారం తెలిపారు. ముఖ్య అతిథిగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. నాయీబ్రాహ్మణులు హాజరై సమావేశం విజయవంతం చేయాలని కోరారు.

## ఉచిత బస్సుతో ఆటో కార్మికుల పొట్ట కొట్టొద్దు

**కొలిమిగుండ్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేసి, ఆటో కార్మికుల పొట్ట కొట్టొద్దని ఆటో కార్మిక సంఘం నాయకులు చంటి, శ్రీరంగ, రాజు, కంబగిరిస్వామి విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఆటో కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్మికులు నాగరాజు, శివ, రమణ, శీన, కంబయ్య, నాగశేషు పాల్గొన్నారు.

## టీబీ నివారణకు ప్రత్యేక దృష్టి

**కొలిమిగుండ్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని వివిధ గ్రామాల్లో టీబీ నివారణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పీహెచ్‌సీ వైద్యుడు హరిచరణ్‌రెడ్డి తెలిపారు. మండలంలో 700కు పైగా టీకాలు పంపిణీ చేసినట్లు ఆయన వెల్లడించారు.